# మానవుడు

రచన: ఏ. ఎస్. రామారావు

పెద్ద మార్కెట్టు పక్కన స్టేషనుకు పోయేరోడ్డుమీద వారగా రిక్షానిలబెట్టి చుట్ట ముట్టించాడు రాఘవులు. సాయంత్రమయింది. ఆఫీసులూ, కాలేజీలు వదిలే వేళ. కాసేపట్లో బేరం దొరకొచ్చు. అప్పుడు తీరిగ్గా చుట్టకాల్చుకోవడం పడదు. అందుకని ఏకబిగిని చుట్టను పీలుస్తూ, పైకి దమ్మును యింజను పొగలా దట్టంగా వదుల్తూ, మింటికేసి నిశ్చలంగా చూస్తూ రిక్షాలో కూర్చున్నాడు రాఘవులు. అతని దృష్టిలో ఆకాశాన్నంటుతున్నట్టు కొండ మీద కట్టిన కింగ్‌జార్జి ఆసుపత్రి సూర్యాస్తమయ కాంతుల్లో ఎంతో అందంగా అవుపిస్తోంది.

దేశం మొత్తంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రి అది.

ఆ ఆసుపత్రికీ, రాఘవులుకీ వున్న సంబంధం ఈ నాటిదికాదు. రాఘవులు తన రిక్షాలో ఎందరినో ఆ ఆసుపత్రిలోనికి చేరవేసాడు. ఎందర్నో అక్కణ్ణుంచి తన రిక్షాలోనే తీసుకు వెళ్లాడు. చాలా మంది సంతోషంలో తను పాలుపంచుకున్నాడు. బినామీలా సంపాదించుకున్నాడు. అలానే ఎందరి దుఃఖంలోనే భాగంతీసుకుని, సానుభూతిగా కన్నీటి చుక్కలను రాల్చిన సమయాలుకూడా చాలా వున్నాయి.

"సుఖ దుఃఖాలకూ, వెలుగుచీకట్లకూ నిలయమైన అద్భుతమైన ఆలయం అది" అనుకున్నాడు తనలో రాఘవులు.

అప్రయత్నంగా అతని పెదవులమీద చిరునవ్వు నిలిచింది. ఆ నవ్వు వెనుక దాగిన - ఒకనాటి తనకు ఆ ఆసుపత్రితో పరిచయం కలిగిన సంఘటన - గుర్తుకొచ్చింది. మరొకసారి నెమరు వేసుకున్నాడు రాఘవులు.

ఒక రోజు.

మామూలుగా స్టాండులో రిక్షా నిలబెట్టి బేరంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. అంతలో కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్న పార్వతీశంగారు కింగ్‌జార్జి ఆసుపత్రికి రిక్షా తీసుకుపొమ్మంటూ రిక్షాలో కూర్చున్నారు. తనకు ఆయన బాగా తెలుసు. కాలేజీకి ఆడపిల్లల్ని తన రిక్షాలో తీసుకెళ్ళినప్పుడెన్నిసార్లో ఆయన్ను చూశాడు. పిల్లలంతా ఆయన్ను గురించి గొప్పగా చెప్పుకోవడం తనెన్నిసార్లు వినలేదు! ఎన్నాళ్ళనుంచో చూద్దామనుకుంటున్న ఆ పెద్ద ఆసుపత్రికి రిక్షాకట్టడం అదే మొదటిసారి కావడంచేత బేరంకూడా నిర్ణయించుకోకుండా వెంటనే రిక్షా కట్టేశాడు.

తను ఆ ఆసుపత్రిని చూడాలని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాడు. ఈ నాటికి తనకా అవకాశం చిక్కినందుకు తన ఆనందం అవధులు దాటిపోయింది. దేశం నలుమూలల్నుంచీ ఆ ఆసుపత్రిలో చేరడానికీ, చూడడానికి రోజూ లెక్కలేనంత మంది జనం వచ్చిపోతుంటారు. పుట్టి వూళ్ళో వున్న ఆసుపత్రిని తానంతవరకూ చూడలేక పోయినందుకు తనను తానే నిందించుకుంటూ, వడివడిగా పరుగెత్తాడు తను.

"బ్లడ్ బాంకుకు తీసుకెళ్లు" అన్న పార్వతీశంగారి మాటలువిని విస్తుపోయాడు తను.

"అదేటి బాబూ! బాంకులన్నీ వూళ్ళో వుండగా, ఆసుపత్రిలో బాంకేటి బాబూ?" ఆశ్చర్యంగా అడిగాడు తను.

తనువేసిన ప్రశ్నకు పార్వతీశంగారు నవ్వుకున్నారు. తనకానాటివరకూ తెలియని ఎన్నో విషయాలను ఆయన చెప్పారు. బ్లడ్ బాంకులో రకరకాల మనుషుల రకరకాల రక్తాలను నిలవేస్తారు. అక్కడ — ఆ ఆసుపత్రిలోని రోగులకు రక్తం చాలకపోతే బాంకులోంచి రక్తం తీసుకెళ్లి వాళ్లవంటిలో ఎక్కిస్తారు. ఆ బాంకుకు ఎవరైనా రక్తాన్ని యివ్వొచ్చుట. అప్పుడుకూడా ఆ రక్తాన్నిచ్చే మనుషుల అవసరానికి సరిపోగావున్న రక్తాన్నే తీసుకుంటారట. అలా తీసిన రక్తాన్ని జాగ్రత్తగా దాచి, రక్తంలేక చావుబ్రతుకుల్లో వున్నవాళ్ల ప్రాణాలను కాపాడతారని తొలిసారిగా తనువిన్నప్పుడు తన ఆశ్చర్యానికి అంతులేక పోయింది.

ఆ రోజునే పార్వతీశంగారి భార్యకు రక్తాన్ని ఎక్కించారట. గర్భస్రావంలో బాధపడుతూ, చావుబ్రతుకుల్లో కొట్టుకుంటున్న ఆమెకు బ్లడ్ బాంకునుంచి రక్తాన్ని తీసుకెళ్ళివ్వడంతో నెమ్మదించిందనీ, యింక ఫరవాలేదనీ పార్వతీశంగారు ఆనందంగా చెబుతున్నప్పుడు, ఆయన ఆనందంలో తనూ భాగం పంచుకున్నాడు.

బ్లడ్ బాంకును గురించి ఆయన చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్న తనకు ఆ బాంకును చూడాలన్న కోరిక కల్గింది.

తను అక్కడకు చేరుకునేసరికి అక్కడెంతోమంది జనం వరుసలో నిల్చుని వున్నారు. వాళ్లంతా రక్తాన్నివ్వడానికే వచ్చారనుకుని ఆశ్చర్యపోయాడు తను.

తను కండపుష్టి కలిగి ఎంతో బలంగా వున్నాడు. తన వంట్లో కష్టపడి కూడబెట్టిన రక్తం కావల్సినంత వుంది. తన రక్తంతో మరొక ప్రాణాన్ని నిలబెట్టడం కంటె పుణ్యకార్యం మరొకటి వుండదు. తనుకూడా రక్తాన్నిస్తేనో?

తనకు తెలియకుండానే తను రిక్షా నక్కడపెట్టి వరుసలో నిల్చున్నాడు. తన వంతు రావడంతో, డాక్టర్లు తనని పరీక్షించి, తనవృత్తికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలు వేశారు. తన వంట్లోంచి ఎనిమిదవున్నుల రక్తాన్ని తీసుకోవచ్చునన్న నిర్ణయానికి వచ్చారు. తను 'సరే' నన్నాడు.

తనను మరోగదిలోకి తీసుకెళ్ళి బల్లమీద పడుకోమన్నారు. మళ్ళా తనను తాను తెల్సుకునేటప్పటికి తనలో చెప్పలేని నీరసం. అంతకు గంట క్రితం రాఘ

వులేనా తను ? అనుకున్నాడు. ఒక్కసారిగా అంతరక్తం తన ఒంట్లోంచి పోవడంతో రక్తంలోవున్న బలాన్ని తొలిసారిగా తెల్సుకున్నాడు తను.

ఒక నర్సు వచ్చి వేడిపాలు, రొట్టె యిచ్చింది. మరెవరో వచ్చి చేతిలో పది రూపాయిలనోట్లు కొన్ని పెట్టాడు. అంత డబ్బును ఒక్కసారిగా తనెప్పుడూ చూడక పోవడంతో తనెంతగానో ఆశ్చర్య పోయాడు.

"ఏమిటిది ? ఎవరికీ డబ్బు ?" అడిగాడు తను.

"రక్తానికి ప్రతిఫలం" అన్నాడతను.

అప్పటికికాని తెల్సుకోలేక పోయాడు. వచ్చిన వాళ్లలో కొందరు రక్తన్ని అమ్ముకోడానికి వచ్చారని. రక్తన్నమ్ముకోవడం చాలా నీచమైనపని అనుకున్నాడు తను. భగవంతుడు సృష్టించిన తను, అతని సృష్టిలోని మరి కొందరి ప్రాణాలను రక్షించడానికి డబ్బుతీసుకోవడంకంటె ఘోరమైన పాపం మరోటి వుండదనిపించింది. వెంటనే తను ఆ డబ్బును తిరిగి యిచ్చేస్తూ "రక్తాన్ని నేను వూరికే యిచ్చానుకాని డబ్బు కోసం కాదు" అని ఆవేశంగా అన్న మాటలు అక్కడున్న పెద్దలందర్నీ ఆశ్చర్య పరిచాయన్న సంగతి తను గుర్తించక పోలేదు. అప్పుడు వాళ్లంతా తనను పొగుడుతూ, తనగురించి తనకు తెలియని భాషలో గొప్పగా చెప్పుకున్న సంఘటన తనకింకా బాగా జ్ఞాపకం వుంది.

అనాడు ఆసుపత్రి వదిలినప్పుడు చెప్పలేనంత నీరసాన్ని అనుభవించాడు. ఒకటి, రెండు రోజులు తనా విధంగా బాధ పడినా, మళ్లా మామూలు మనిషయ్యాడు. తొలిసారి రక్తాన్నిచ్చినప్పుడు అదోలా భయాన్నీ, నీరసాన్నీ అనుభవించినా, మళ్లా, మళ్లా రక్తాన్నివ్వడంతో ఆ భయం తొలగిపోయింది. తను ఆసుపత్రిలో వారందరికీ సన్నిహితుడై పోయాడు. తన రక్తంతో ఎందరి అపరిచితుల ప్రాణాలను రక్షించాడో !

"ఏయ్ రిక్షా" అన్న పిలుపుతో రాఘవులు ఈ లోకంలోకి వచ్చాడు.

"బాబూ" అంటూ చుట్ట నార్పేసి, చెవుకు తగిలించి ఆ వ్యక్తి దగ్గరకు రిక్షా లాక్కెళ్లాడు.

యౌవనపు పొంగులోవున్న ఆ వ్యక్తి ట్వీడు సూటులో మరింత అందంగా అపుపిస్తున్నాడు. అతనిని చూస్తే కలవారి బిడ్డలా వున్నాడు. అతని ముఖంలో ఎవరినో తొందరగా కల్సుకోవాలనే ఆతృత కొట్టవచ్చినట్లు కనబడుతోంది. లాభసాటి బేరమేనని పొంగిపోయేడు రాఘవులు.

"ఎక్కడికి పోవాలి బాబూ?" అడిగాడు రాఘవులు.

"తొందరగా మెడికల్ కాలేజీ హాస్టల్ కేసి తీసుకెళ్లు" అంటూ రిక్షాలో కూర్చున్నాడతను. రాఘవులు రిక్షా నెత్తుకున్నాడు.

రిక్షా కింగ్ జార్జి హాస్పిటల్ అప్ రోడ్డు మీంచి బరువుగా పోతోంది. రాఘవులుకు ఆ రోడ్డుతో ఎంతో సన్నిహిత సంబంధం వుంది. ఆ రోడ్డుమీదుగా తనెన్నోసార్లు రిక్షాను నడిపించాడు. ఎన్నోసార్లు ఒంటిగా బ్లడ్ బ్యాంకుకువెళ్ళి రక్తన్నిచ్చి వచ్చాడు.

రాఘవులు మనస్సు పరిపరి విధాల ఆలోచించసాగింది.

అక్కడ పనిచేస్తున్న వాళ్లంతా తనకు పరిచయస్థులే. పెద్ద పెద్ద డాక్టర్లు కూడా తనెక్కడ కనిపించినా పలకరించకుండా వెళ్లరు. వాళ్ల అంతరమెంత ? తనంతర మెక్కడ ? రాఘవులు తన గొప్పతనానికి తనే మురిసిపోతూ, అనుకోని ఉత్సాహంతో కొండ నెక్కుతున్నట్లుండే ఆ తారు రోడ్డుమీద అంత బరువునూ సునాయాసంగా లాగుతున్నాడు.

రిక్షా ఆసుపత్రి మొదటి గేటు చేరుకునేసరికి ఎదురుగా రక్తం కంటె ఎర్రనైన రంగుతో రాసిన "బ్లడ్ బ్యాంకు" అన్న అక్షరాలు అపుపించాయి. రాఘవులు శరీరం ఒక్కమారుగా పులకరించింది. ఆ బాంకును గురించీ, అక్కడ జరిగే వింతలూ, విశేషాలు గురించీ తనకంటె ఎక్కువగా తన రిక్షాలో వెళ్లే మరెవరికీ తెలియదనుకున్నాడు.

"బాబూ" రిక్షాలోనున్న వ్యక్తిని చూస్తూ పిల్చాడు.

అతడీ ప్రపంచంలో లేడు. అతని మనస్సెక్కడో వుంది. అతని కళ్లెవరి కోసమో వెతుకుతున్నట్లున్నాయి.

రాఘవులు పిలుపు అతని చెవుల్ని తాకడంతో ఈ ప్రపంచంలోకి వచ్చి 'ఊ' అన్నాడు.

రాఘవులుకు ఎక్కడలేని ఉత్సాహం పొంగు కొచ్చింది. అతనికి బ్లడ్ బాంకును చూపిస్తూ, దానిగురించీ, అక్కడి విశేషాల గురించీ తనొక్కడికే తెల్సినట్లు వర్ణిస్తూ, తన ఘనతను గురించి ఘనంగా చెప్పకోసాగాడు రాఘవులు.

కాని, అతనికి రాఘవులు మాటలేమీ రుచించలేదు. అతనప్పుడు రాఘవులు మాటలు వినేస్థితిలోకూడా లేడు. రాఘవులు ఘోషనుంచి తప్పించుకోడానికని "నువ్వు చెబుతున్నది నిజంకాదు. అక్కడున్న మనుషులు నువ్వనుకుంటున్నంత మంచి వాళ్లుకారు. అక్కడ అన్యాయాలకీ, మోసాలకీ అంతులేదు. డబ్బున్నవాడికే అక్కడ పలుకుబడి. దోమలూ, నల్లులూ త్రాగగలిగినంత రక్తాన్ని పీల్చుకుని వదిలిపెడతాయేమోగాని, అక్కడి మనుషులకు తృప్తి అన్నది వుండదు. మనకెందుకులే అక్కర్లేని గొడవ, త్వరగా పోనీ రిక్షా" అంటూ పొంగుతున్న పాలమీద నీళ్ళు చల్లినట్లుగా అతను రాఘవులు ఉత్సాహాన్నంతటినీ అణచివేయడంతో రాఘవులు మరి మాట్లాడ లేక పోయేడు.

"అతని మాటలెంతవరకూ నిజం? తనిచ్చిన రక్తం సద్వినియోగం కాలేదా ? నిజంగా అక్కడున్న వాళ్లంతా మోసగాళ్ళేనా ?" ఎన్నో ప్రశ్నలు ఒకదాని వెంట ఒకటివచ్చి, సమాధానం దొరక్క ఒక నిశ్చయానికి రాలేక పోయాడు రాఘవులు.

కల్లోలిత మనస్సుతో రిక్షాను వడివడిగా లాగడం మొదలెట్టాడు. రిక్షా మెడికల్ కాలేజీహాస్టలు దాటిపోయింది. సముద్రం

(తరువాయి 25 వ పేజీలో)

## మానవుడు

(8 వ పేజీ తరువాయి)

మీదనుంచి వస్తోన్న చల్లటిగాలి రాఘవులు మనస్సుకు కొంతహాయి నిచ్చింది.

"అదుగో! ఆ చెట్టు దగ్గరాపు" అన్న మాటలు వినడంతోనే ఆ చెట్టు కేసి చూచాడు రాఘవులు. ఆ చెట్టునీడను ఒక అమ్మాయి నిల్చివుంది అతని రాకకోసం నిరీక్షిస్తూ. ఏమీ చెప్పక్కర్లేకుండానే పరిస్థితిని అర్థంచేసుకున్నాడు రాఘవులు. అతని ఆజ్ఞమేరకు చెట్టుదగ్గర రిక్షాను నిలిపాడు.

"రా లలితా! యిలాకూర్చో!" అనడమే తడవుగా ఆమె నవ్వుకుంటూ వచ్చి రిక్షాలో కూర్చుంది.

"బీచికి పోనీవోయ్" అని అతనాజ్ఞాపించగానే రాఘవులు తిరిగి రిక్షా నెత్తుకున్నాడు. రాఘవులుకు వాళ్ల సంభాషణలు వినాలన్న కుతూహలం లేకపోయినప్పటికీ అవి రాఘవులు చెవుల్లో దూరుతున్నాయి.

"వచ్చావా సారదీ. ఆలస్యమైతే రావేమోననుకున్నాను" అందామె.

తన ఆలస్యానికి కారణాలు వివరిస్తూ క్షమాపణ చెప్పుకున్నాడతను.

'అయితే మనమాట ఏమాలోచించావు?' మళ్లా ప్రశ్నించింది.

"సెలవలు వస్తున్నాయిగా యింటికెళ్ళి అన్నీ చక్క బెడతా. అమ్మనీ, నాన్ననీ ఒప్పించి నిన్ను తప్పకుండా తీసుకెళ్తాను. నువ్వు లేకుండా నేను బ్రతగ్గలనా?"

"ఇష్" అంటూ ఆమె వారిస్తున్న శబ్దం రాఘవులుకు వినిపించడంతో తనలో తానే నవ్వుకున్నాడు.

రిక్షా సముద్రపొడ్డును చేరడంతో రాఘవులు రిక్షా నిలబెట్టాడు. రిక్షాలోంచి యిద్దరూ దిగారు. అతను రాఘవులు చేతిలో రెండు రూపాయిల కాయితం పెట్టగానే రాఘవులు సంతోషానికి మేర లేక పోయింది. అది తీసుకుని కృతజ్ఞతగా నమస్కరించాడు రాఘవులు.

ఆ యిద్దరూ చెట్టా పట్టా లేసుకుని యిసుకలోకి పోతుంటే వాళ్లను చూసి నవ్వుకుంటూ రిక్షాను త్రిప్పాడు రాఘవులు.

ఆ రోజునుంచీ రాఘవులు విభిన్న భావాలమధ్య సంఘర్షణకు లోనవుతూ, ఒక నిశ్చయానికి రాలేక బాధపడ సాగాడు. ఒకనాడుతను గొప్పగా వూహించుకున్న బ్యాంకును గురించీ, అక్కడ పనిచేస్తున్న వాళ్లను గురించీ రాఘవులిప్పుడు మరో విధంగా తలపోయసాగాడు. తను అక్కడున్న వాళ్లమాటలు విని మోసపోయాడేమో ననుకున్నాడు. తానాశించిన విధంగా తన రక్తం వినియోగ పడడం లేదేమో? ఆ ఆసుపత్రిని గురించి తనూహించిన వన్నీ కల్లలేనేమో?

తను చాలా కాలంగా ఈ ప్రపంచాన్నీ, మనుషుల్నీ చూస్తూనే వున్నాడు. యిక్కడ డబ్బున్నవాడికే పలుకుబడి, మర్యాదలు, మన్ననలూ, ఈ పరిస్థితి ఆసుపత్రిలో కూడా ఎందుకుండ కూడదూ? అక్కడ అన్యాయాలు, అక్రమాలు ఎందుకు జరక్కూడదూ? తప్పక జరుగుతాయి అతను చెప్పినట్లు తను మోసపోయాడనటంలో సందేహంలేదు.

రాఘవులు ఒకనాటి తన నిశ్చయాన్ని మార్చుకున్నాడు. అతనికిప్పుడు ఆ ఆసుపత్రిన్నా, అక్కడ మనుషులన్నా ఏహ్యభావం పుట్టుకొచ్చింది. అక్కడ మనుష్యుల్ని అసహించుకున్నాడు. తనింక రక్తన్నివ్వకూడదనుకున్నాడు. ఆ నాటి నుంచీ ఆ బాంకు ఛాయలకే పోలేదు రాఘవులు.

ఎన్నో రోజులు, నెలలు గడిచిపోయాయి.

ఒకనాడు మారుమూల నున్న తన యింటికి ఎందరో మనుషులు ఆందోళనతో రావడంతో రాఘవులుకు భయమూ, ఆశ్చర్యమూ కలిగాయి. ఆ వచ్చినవాళ్లలో తన కంతక్రితం ఆసుపత్రిలో పరిచయమున్న డాక్టరుకూడా వుండడాన్ని చూశాడు. రాఘవులుకేమీ అర్థం కాలేదు. డాక్టర్ని చూడడంలోనే రాఘవులుకు అతనంటే ఎక్కడలేని అసహ్యమూ పుట్టుకొచ్చింది.

"రాఘవులూ! ఆసుపత్రిలో ఒక రోగి రక్తం లేక చావుబ్రతుకుల్లో కొట్టుకుంటోంది. బాంకులోవున్న ఏరక్తమూ ఆమెకు సరిపడడం లేదు. ఆమె బ్రతికి బట్టకట్టాలంటే నీ రక్తం కంటె గత్యంతరం లేదు. ఆమె ప్రాణాలు నీ చేతిలో వున్నాయి రాఘవులూ!" డాక్టరు ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు. రాఘవులు ఏం సమాధానం చెబుతాడోనని డాక్టరుతోబాటు వచ్చిన వాళ్లు ఆందోళనతో, ఆతృతగా రాఘవులు ముఖంలోకి చూడసాగారు.

"అయ్యా! దయవుంచి ఆ యిల్లాలిని కాపాడండి. ఒక్కగానొక్క బిడ్డ. ఆమె ప్రాణాలు నిలపడానికెంత ఖర్చుచెయ్యడానికైనా వెనుదీయం. ఆమె ప్రాణాలు నిలబెట్టి పుణ్యం కట్టుకోండి" మరొకతను ప్రాధేయపడుతూన్నప్పుడు అతనికళ్లనుండి నీళ్లుకారడం రాఘవులు చూడకపోలేదు.

రాఘవులు కేం చెయ్యడానికీ తోచలేదు. తను ఆమె ప్రాణాల్ని రక్షించాలా? లేక మళ్లా మరొకసారి తను మోసపోవాలా? ఎవరేమైనాసరే తను మళ్లా మోసపోకూడదనుకున్నాడు. తననిర్ణయం తిరుగులేనిది.

"అయ్యా! మీ అందరికీ దండం పెట్టుకుంటాను. మళ్ళా ఆ పాపకూపంలోకి రాను. అక్కడ జరిగేదంతా పచ్చిమోసం. మాబోటివాళ్లను నమ్మించి మా రక్తాలతో వ్యాపారంచేసే ఆ పాడు ఆసుపత్రినీ, అక్కడ మనుషుల్నీ నేను నమ్మను. నేను రాను. నా రక్తం యివ్వను. ఆవేశంలో రాఘవులు అంటున్నప్పుడు అతని ముఖం కందగడ్డలా అయింది. రాఘవులు మాటలు వినడంతో, అక్కడకు వచ్చిన వాళ్లందరికీ మిగిలిన ఒక్క ఆశకూడా పోవడంచేత దిగులు చెందారు. కర్తవ్యం ఏమిటన్నట్లుగా డాక్టరు ముఖంలోకి చూశారు.

మనుషుల మనస్తత్వాలను గురించి తెలిసిన డాక్టరు రాఘవులు మాటలకు చలించలేదు. రాఘవులెవరో తప్పుడు మాటలతో

పెద్దవాళ్ళను పట్టించుకోవాలని అర్థం చేసుకోడానికి అతనెంత కష్టపడ్డాడు.

"రాఘవులూ! నీకెవరో సరిగ్గా చెప్పి వుండరేమో. ఆసుపత్రిలో రోగులకు నిత్యం ఎంతో రక్తం కావలసి వుంటుంది. ఎక్కణ్ణుంచి వస్తుంది చెప్పు అంత రక్తం? నీలా ఎంత మంది రక్తాన్ని దానం చెయ్యగలరు? యిలా కష్టపడి డబ్బిచ్చి రక్తాన్ని వారికే ఎంత మంది రోగులకని యివ్వగలం? రక్తానికి [illegible] మా? అమ్మేవాళ్ళకు అంతమందీ కొనగలరా? అందుచేత, ఆయా వ్యక్తుల స్థితి గతుల్ని బట్టి - గొప్పవాళ్ళ దగ్గర డబ్బు తీసుకోవటం, లేనివాళ్ళకు ఉచితంగా యివ్వటమే మేం చేస్తున్న వ్యాపారం, యిదే మేం చేస్తున్న మోసం. నువ్వు ఆవేశాన్ని విడిచి స్థిమితంగా ఆలోచించు రాఘవులూ - మేం చేస్తున్నది ధర్మమో! అధర్మమో!" రాఘవులు ముఖం చూస్తూ డాక్టరు చెప్పడంతో ఆయన మాటలు నిజమేనేమో ననిపించాయి రాఘవులుకు.

"రాఘవులూ! వీరి అమ్మాయి ఆఖరి ఘట్టాల్లో వుంది. వీరి ఆందోళనను నువ్వింకా గుర్తించలేదా? అదే నీ బిడ్డ అయితేనో? ఆలస్యం చెయ్యక వెంటనేరా. కావాలంటే నువ్వే చూడు అక్కడేం జరుగుతూంటుందో. ఎవరో తప్పుగా చెప్పిన మాటలు విని, నువ్వు అపోహ పడుతున్నావు కాని మరొకటి కాదు," అన్న డాక్టరన్న మాటలతో రాఘవులుకు అతన్ని నమ్మడం కంటె గత్యంతరం లేకపోయింది.

"డాక్టరు బాబూ! మీరంతగా చెబుతున్నారు కాబట్టి నేనేమీ బదులు చెప్పను. కాని, రోగిని చూడకుండా రక్తం యివ్వను" అన్న రాఘవులు మాటలతో అక్కడున్న వాళ్ళ ముఖాలలో వెలుగులు నిండాయి.

డాక్టర్ రాఘవుల్ని వెంటబెట్టుకుని రోగి దగ్గరకు వచ్చాడు. ఆమె ఈ ప్రపంచంలోనే లేదు. ఆమె చుట్టూ వున్న బంధు జనం భగవంతుని మీద భారంవేసి దుఃఖిస్తూ కూర్చున్నారు. రాఘవులుకు అనుకోని పరిస్థితిని చూసేసరికి హృదయం ద్రవించిపోయింది. ఆనాడు పార్వతీశం గారి భార్య గుర్తుకొచ్చింది. బ్యాంకులో రక్తాన్నివ్వడం చేతనేకదా ఆమె యిప్పుడు చల్లంగా కాపురం చేసుకుంటోంది అనుకున్నాడు.

రాఘవులు రోగినీ, అక్కడున్న ఒక వ్యక్తినీ చూడడంతోనే అతని ఆశ్చర్యానికి అంతులేకపోయింది. ఆరోజున తను వీరిద్దరినీ బీచి ఒడ్డుకు తీసుకు వెళ్ళింది. వాళ్ళ అన్యోన్యతను చూసి తానానాడు ఎంతగానో మురిసిపోయాడు కూడా. అతనే ఈ ఆసుపత్రిని గురించి ఏవేవో చెప్పాడు. తనూ నమ్మి అపోహపడ్డాడు. తనెంతో తప్పుపని చేసినందుకు తనను తానే నిందించుకున్నాడు రాఘవులు.

"డాక్టర్! నా రక్తాన్ని తీసుకోండి. ఈమెను బ్రతికించండి" అన్న రాఘవులు మాటలతో అక్కడున్న వాళ్ళందరికీ పోయిన ప్రాణాలు తిరిగివచ్చినట్లనిపించింది. డాక్టరు వెంట రాఘవులు వెళ్ళిపోయాడు.

[illegible] నీరసంగా వస్తున్న రాఘవుల్ని ఒక వ్యక్తి సమీపించి అతని చేతిలో నూరు రూపాయల కాగితం పెట్టబోయాడు. రాఘవులు అతని కళ్ళల్లోకి చూశాడు. అతనెవరో కాదు! తానానాడు బీచికి తీసుకెళ్ళిన యువకుడే! కాని అతను రాఘవుల్ని గుర్తుపట్టలేదు.

రాఘవులు అతన్ని తప్పించుకుని ముందుకు నడిచాడు నీరసంగా. ఆ యువకుడెంతగా పిలుస్తున్నప్పటికీ అతను వినిపించుకోలేదు.

రాఘవులు మనస్సులో యిప్పుడెన్నో ఆలోచనలు మెదుల్తున్నాయి. ప్రపంచంలో యింకా ఎన్నో ఆనందాలను అనుభవించాల్సిన ఒక వ్యక్తి ప్రాణాలను నిలబెట్టగలిగాననే ఆనందమే అతని హృదయంలో నిండిపోయి అతని కెక్కడలేని ఉత్సాహాన్ని యిచ్చింది.

ఆమె భర్తతో, చక్కటి సంతానంతో, సూర్యాస్తమయ వేళలో బీచిలో విహరిస్తూ ఆనందాన్ననుభవిస్తూ, సముద్రపు హోరుతో శృతి కలిపి గల గల నవ్వుతున్నట్లు రాఘవులు కళ్ళకు కట్టినట్లయింది.

ఉత్సాహంగా పరుగులు వేస్తూ జనంలో కలిసిపోయాడు రాఘవులు.

———o———


వినోదానికి ! విజ్ఞానానికి !!

# కవితా ప్రచురణలు

చదవండి చదివించండి

గోరింటాకు (నవల)
కొమ్మూరి వేణుగోపాలరావు 5-00

మెఱుపుతీగెలు (నవల)
- ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి 1-25

తప్పటడుగులు (నవల)
- హరగోపాల్ 1-50

ఇంటిదీపం (నాటిక)
విడియాల చంద్రశేఖరరావు 0-75

వదిన (నాటిక)
విడియాల చంద్రశేఖరరావు 0-75

యీ పై పుస్తకాలు ఒకేసారి తెప్పించుకొనేవారికి రు 8/- లకే యివ్వగలం పోస్టేజి మేమే భరించి పంపగలం. మీకే పుస్తకాలు కావలసినా మాకు వ్రాయండి.

కవితా పబ్లికేషన్
గోపువారి స్ట్రీట్ : : విజయవాడ-2.